## క్లుప్తంగా

### దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం



మొగల్తూరులో పందిరి ఏర్పాటుకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొగల్తూరు: ప్రతి ఏటా దసరా ఉత్సవాలను మొగల్తూరులోని కూరగాయల వర్తకులు ఘనంగా నిర్వహిస్తారు. అక్టోబర్ 3 నుంచి ప్రారంభం కానున్న దేవీ నవరాత్రులకు సంబంధించి పందిళ్లను ఏర్పాటు చేసేందుకు అర్చకులు కొత్తలంక ప్రసాద్ శుక్రవారం పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన గునిశెట్టి నర్సింహమూర్తి-వరలక్ష్మి దంపతులు పందిరిరాటకు ప్రత్యేక పూజలు జరిపి పందిళ్ల పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల వర్తకులు ముక్కు ఓం, ముక్కు పుల్లయ్య, గుత్తుల బాబి, ముక్కు జ్ఞాని, పినిశెట్టి సాయి, వీరభద్రం, సంకా సోంపండు, జక్కంశెట్టి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్‌కు ఘన నివాళి



సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బలరామ్

నరసాపురం: జీవితాంతం పేదల పక్షాన పోరాడిన ఆర్ఎస్ కమ్యూనిస్ట్ యోధుడని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ అన్నారు. సీపీఎం మాజీ ఎమ్మెల్యే ఆర్ సత్యనారాయణ రాజు, మరోనేత వలవల శ్రీరామమూర్తి సంస్మరణ సభ శుక్రవారం స్థానిక మీరా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ అటు ఆర్ఎస్, ఇటు శ్రీరామ్మూర్తి ఇద్దరూ కూడా నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాడారని చెప్పారు. ఇలాంటి నేతల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. సీపీఎం ఇటీవల అనేక మంది నేతలను కోల్పోతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పొగాకు పూర్ణ, ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు నాఆరాయణరావు, బూడిద జోగేశ్వరరావు పాల్గొన్నారు.

### పెనుగొండ సీఐగా విజయకుమార్



సీఐ విజయకుమార్

పెనుగొండ: పెనుగొండ సీఐగా రాయుడు విజయ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సింగ్‌నగర్ ట్రాఫిక్ నుంచి బదిలీపై పెనుగొండకు వచ్చారు. 2018లోనూ పెనుగొండ సీఐగా విధులు నిర్వహించారు. పలు కీలక కేసులు ఛేదించడంలో కీలకంగా వ్యవహరించారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన విజయకుమార్‌కు పెనుగొండ ఎస్సై కె.గంగాధర్, పోలీస్ సిబ్బంది స్వాగతం పలికారు. శాంతి భద్రతలు కాపాడడంలో ప్రజలు సహకరించాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


### పాలకొల్లు రూరల్ ఎస్సైగా సురేంద్రకుమార్



బి.సురేంద్రకుమార్

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ ఎస్సైగా బి సురేంద్రకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్సైగా పని చేసిన హరికృష్ణ కృష్ణాజిల్లాకి బదిలీ అయ్యారు. సురేంద్రకుమార్ గతంలో భీమవరంలో పని చేశారు. అలాగే యలమంచిలి, పోడూరు మండలాల్లో ఎస్సైగా పని చేశారు. రూరల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సురేంద్రకుమార్‌కు రూరల్ పోలీసులు శుభాకాంక్షలు తెలియజేశారు.

### పాలకొల్లు పట్టణ రెండో ఎస్సైగా ప్రసాద్



జి.ప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: పట్టణ రెండవ ఎస్సైగా ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు భీమవరం టూటౌన్ ఎస్సైగా పని చేసిన ప్రసాద్ బదిలీపై పాలకొల్లు పట్టణానికి వచ్చారు. 2012 బ్యాచ్‌కు చెందిన జి.ప్రసాద్ మొదట్లో ధర్మాజీగూడెంలో పనిచేశారు. అనంతరం పది స్టేషన్లలో విధులు నిర్వహించారు.

### నేడు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం మధ్యాహ్నం మూడు గంటకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ శుక్రవారం విలేకరులకు చెప్పారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

# శిథిలావస్థలో ప్రభుత్వ పశు వైద్యశాల

**శ్లాబ్ పెచ్చులు పడిపోతున్నా అందులోనే వైద్యసేవలు**



శ్లాబ్ లీకేజీతో పెచ్చులూడిపడిపోతున్న కంప్యూటర్ రూమ్



పెచ్చులు ఊడి పడిపోతున్న డాక్టర్ రూమ్



బురదలోనే షెడ్‌లో ఆవుకు చికిత్స చేస్తున్న వైద్యులు



ప్రహరీ లేని ప్రభుత్వ పశు వైద్యశాల ఆవరణ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ఉన్న పశు వైద్యశాల అత్యంత అధ్వానంగా ప్రమాదకరంగా ఉంది. నాడు దాతలు ప్రభుత్వ పశు వైద్యశాల నిమిత్తం సుమారు ఒకటిన్నర ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. 1968లో పశు వైద్య శాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. 1972, 73 నాటికి భవనం పూర్తి చేశారు. అంటే దాదాపుగా నేటికి పశు వైద్యశాలను నిర్మించి 52 ఏళ్లు కావస్తుంది. ఇక్కడ అనారోగ్యంతో ఉన్న పశువులకు ఓపీ విభాగమే కాకుండా శస్త్రచికిత్సలు కూడా చేస్తుంటారు. అయితే ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ ఆస్పత్రి ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతుంది. ఈ ఆసుపత్రిలో డాక్టర్ కార్యాలయం, కంప్యూటర్ విభాగం, స్టోర్‌రూము, హాలు, ల్యాబ్, రికార్డ్ రూము, డ్రెస్సింగ్ రూము, ఓపీ విభాగం, అవుట్ పేషెంట్ షెడ్, ట్రెవిస్ షెడ్ ఇన్ని విభాగాలు ఉన్నాయి. కానీ ఏ విభాగంలోకి వెళ్లి చూసినా ప్రమాదకరంగానే ఉన్నాయి. ఆసుపత్రికి ప్రహరీ ఉన్నా సుమారు ఏడెనిమిదేళ్ల క్రితం మునిసిపల్ డ్రెయినేజీ నిర్మాణం కోసం గోడను తొలగించారు. అప్పటి నుంచి నేటి వరకూ వెటర్నరీ వెటర్నరీ వైద్యులు ఎవరు వస్తే వారే ప్రహరీ నిర్మించాలని మునిసిపల్ అధికారులకు దరఖాస్తులు చేస్తూనే ఉన్నారు. నేటికి ఆ ప్రహరీ విషయంలో మాత్రం మున్సిపాలిటీ నుంచి స్పష్టత రాలేదు

**భయపడుతున్న ఉద్యోగులు**

అసుపత్రి భవనంలో అన్ని విభాగాలు ఉన్నా కూర్చొని పనిచేయడానికి మాత్రం సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ఏ శ్లాబ్ పెచ్చు రాలిమీద పడిపోతుందోనని ఆందోళనగానే పని చేస్తున్నారు. భారీ వర్షం కురిసిందో? పైన పెచ్చులతో పాటు మోకాలు లోతు నీటిలో పనిచేయాల్సిందే. ఇక అవుట్ పేషెంట్ విభాగం షెడ్‌లో అయితే కొద్దిపాటి వర్షానికే నీరు నిల్వ ఉండిపోతుంది. పశువులను ఐరన్ రాడ్‌కు గట్టిగా కట్టి వాటికి చికిత్స చేయాలంటే కాళ్లు జారిపోతున్నామని సిబ్బంది వాపోతున్నారు. వర్షాకాలం వస్తే పశువులకు చికిత్స చేయాలంటే మాత్రం చాలా ప్రమాదకరంగా ఉంటుందని అంటున్నారు.

**స్థలం ఫుల్.. సౌకర్యాలు నిల్**

ఈ పశువైద్య శాలలో రక్తపరీక్షలు చేయడానికి సిఎడిడిఎల్ (కానిస్టెన్స్ లెవల్ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్) ల్యాబ్ సౌకర్యం ఉంది. ఇక్కడ రక్తం, పేడ, యూరిన్, మిల్క్, గర్భస్రావం, కళ్లె వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారు. ఇవే టెస్టులు బయట చేయాలంటే సుమారు రూ. 3 వేల వరకూ ఖర్చవుతుంది. ఇక్కడ సర్జరీలు అలాగే రిఫరల్ కేసులు కూడా చేస్తారు. ఇన్ పేషంట్ విభాగం మన ప్రాంతానికి దగ్గర్లో తణుకులో మాత్రమే ఉంది. ఇక్కడ ఓపి వచ్చి రోజుకు కుక్కలు 30 నుండి 40, గేదెలు, ఆవులు 10 నుండి 15 వరకూ వస్తుంటాయి. పట్టణంలోని పశువుల ఆస్పత్రికి కావాల్సినంత స్థలం అందుబాటులో ఉన్నా స్థలం ఉన్నా నిర్మాణం చేయడానికి మాత్రం రాజకీయ నాయకులు, పశు సంవర్ధక శాఖ అధికారులు చొరవ చూపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వెటర్నరీ ఆసుపత్రికి వచ్చే రైతులు, జంతు ప్రేమికులు ఇక్కడ వైద్య సదుపాయం చక్కగా అందుతుందని కానీ ఇంత స్థలం ఉన్నా సరైన సౌకర్యాలు కల్పించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ జంతువుకైనా గాయం అయితే ఇన్ పేషెంట్‌గా ఇక్కడ ఉంచి చికిత్స చేయించాలంటే మాత్రం స్థలం ఉన్నా సౌకర్యాలు లేవని రైతులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి నూతన పశు వైద్యశాలను నిర్మించాలని కోరుతున్నారు. పాలకొల్లు, యలమంచిలి మండలంలో సుమారుగా గేదెలు 14,500, ఆవులు 5వేలు, గొర్రెలు, మేకలు 4 వేలు వరకూ ఉన్నట్లు పశు వైద్య శాఖ అధికారులు చెబుతున్నారు.

**భవనం శిథిలావస్థకు చేరింది**



పాలకొల్లులోని పశువైద్య శిథిలావస్థకు చేరింది. చికిత్స చేయడానికి సిద్ధంగా ఉన్నా భవనం శ్లాబ్ నానిపోయి పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. భారీ వర్షం కురిస్తే మాత్రం మోకాలు లోతులో నీళ్లు ఉండిపోతున్నాయి. సెక్యూరిటీ కోసం ప్రహరీ నిర్మించాలని మునిసిపల్ అధికారులకు చాలా పర్యాయాలు దరఖాస్తులు చేశాం. సుమారు 8 ఏళ్లు అవుతుంది ప్రహరీ తొలగించి ఇప్పటికీ మునిసిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

– జి.మల్లేశ్వరరావు, పాలకొల్లు ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు

### నేడు పాపప్రక్షాళన పూజలు

నరసాపురం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చంద్రబాబు పాప ప్రక్షాళన పూజలు నిర్వహిస్తున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరసాపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో జరిగే పూజా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. ఉదయం 9 గంటలకు పార్టీ నేతలు, కార్యకర్తలు రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయానికి హాజరుకావాలని చెప్పారు.

**మొగల్తూరులో..**

మొగల్తూరు: చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఆలయాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఏఎంసీ మాజీ చైర్మన్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లాబత్తుల రవికుమార్ శుక్రవారం ఓప్రకటనలో కోరారు. తిరుమల పవిత్రతను, స్వామి వారి ప్రసాదం విశిష్టతను, అపవిత్రం చేసినందుకు చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకే ఈ పూజలను స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

**పాలకొల్లులో..**

పాలకొల్లు అర్బన్: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాద విశిష్టతను సీఎం చంద్రబాబు అపవిత్రం చేసిన కారణంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు శనివారం గాంధీబొమ్మల సమీపంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పాపప్రక్షాళన పూజలు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ తొమ్మిది గంటలకు యాళ్లవాని గరువులోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని గుడాల గోపి ఒక ప్రకటనలో కోరారు.

## మొగల్తూరు గ్రూప్ ఆలయాల ఈఓగా శ్రీనివాస రెడ్డి



ముత్యాలపల్లిలో ఈఓగా భాద్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస రెడ్డి

మొగల్తూరు: మొగల్తూరు గ్రూప్ ఆలయాల కార్యనిర్వహణాధికారిగా బండి శ్రీనివాస రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని ముత్యాలపల్లి, కేపీ పాలెం, పేరుపాలెం, మొగల్తూరు గ్రామాలకు చెందిన 8 దేవాలయాలకు కార్యనిర్వహణాధికారిగా వ్యవహరిస్తారు. మొగల్తూరులోని రాజగోపాల స్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, రామాలయం, విశ్వేశ్వర స్వామి ఆలయం, ముత్యాలపల్లిలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, కేపీ పాలెంలోని రాజగోపాల స్వామి ఆలయం, పేరుపాలెం నార్త్‌లోని మదన గోపాలస్వామి ఆలయం, చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలకు ఈఓగా వ్యవహరిస్తారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన చాగంటి సురేష్ నాయుడు నుంచి బాధ్యతలు చేపట్టారు. తాను నూజివీడు గ్రూప్-2 దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్నానని, ఇటీవల నిర్వహించిన బదిలీల్లో తనను మొగల్తూరు గ్రూప్ దేవాలయాలకు బదిలీ చేశారని ఆయనను కలిసిన విలేకరులకు తెలిపారు.

## ప్రజలు భాగస్వామ్యులు కావాలి



పెనుగొండలో స్వర్ణాంధ్రా కరపత్రాలు విడుదల చేస్తున్న సర్పంచ్ శ్యామలాసోనీ శాస్త్రి

పెనుగొండ: స్వచ్ఛత హీ సేవా-2024లో ప్రజలు భాగస్వామ్యులు కావాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెనుగొండ పంచాయతీ వద్ద గ్రామ సభ నిర్వహించి అర్జీలు స్వీకరించారు. అనంతరం స్వర్ణాంధ్రా పోస్టర్లు విడుదల చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తాగునీరు శుభ్రతపై శ్రద్ధ వహిస్తే వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి టి రత్నాకరరావు, హౌసింగ్ బొక్కా లక్ష్మణ్, మండ ప్రసాద్, కాకి ప్రభాకర్, పులిగోరు రవికుమార్, కానూరి అర్జునరావులు పాల్గొన్నారు.

**వడలిలో ప్రతిజ్ఞ**

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ ఆవరణలో జరిగిన సమావేశంలో ప్రతిజ్ఞ చేశారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పీఏ రామకృష్ణ, ఉప్పలపాటి చంటి పాల్గొన్నారు.

## ఆడపిల్లలు ప్రణాళిక ప్రకారం చదువుకోవాలి



వెలివెలలో భేటీ బచావో.. భేటీ పడావో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ప్రతి ఆడపిల్ల విద్యావంతురాలు కావాలని, దీనికి చిన్నతనం నుంచి వారు ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు చెప్పారు. పాలకొల్లు మండలం వెలివెలలో శుక్రవారం భేటీ బచావో-భేటీ పడావో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను విద్యార్థులు అర్థం చేసుకుని బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మంగ మాట్లాడుతూ ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే ఎవరైనా అసభ్యకరంగా తాకినట్లు గుర్తిస్తే వారిపై వెంటనే ఉపాధ్యాయులకు, లేదా పెద్దలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.సుధారాణి, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు గెద్దం కుటుంబరావు, హెచ్ఎం బళ్ల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కట్నం కోసం వేధిస్తున్న నలుగురిపై కేసు

నరసాపురం: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారన్న ఫిర్యాదుపై శుక్రవారం నలుగురిపై కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్సై జయలక్ష్మి చెప్పారు. దీనికి సంబంధించి వివరాల ప్రకారం పట్టణంలో ఓ వార్డు సచివాలయంలో సెక్రటరీగా పనిచేస్తున్న లక్ష్మీలావణ్యకు పాలకొల్లుకు చెందిన పాలా వీర వెంకట సతీష్‌కు 2023లో వివాహం జరిగింది. అయితే లావణ్యను భర్తతో పాటు అత్త, మామలు, మరది అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

## డిజీ లాకర్‌తో సర్టిఫికెట్లు భద్రం

ఆకివీడు: కంప్యూటర్‌లో ధృవ పత్రాలను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా డిజీ లాకర్ విధానాన్ని సృష్టించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అన్నారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డిజీ లాకర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారానే ధృవపత్రాలు మంజూరు అవుతాయన్నారు. నూతన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుజేస్తుందన్నారు. ఇలా భద్రపరుచుకున్న వాటిని అవసరం మేరకు జిరాక్స్‌లు తీసుకోవచ్చన్నారు.

**విజ్ఞానాన్ని అందించే పర్యాటకం**

పర్యాటకం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని, కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. కళాశాల ఆవరణలో శుక్రవారం పర్యాటక దినోత్సవం నిర్వహించారు.

## సినీ నటుల మాయ నుంచి బయటకు రావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వర్లు

నరసాపురం: విద్యార్థులు సినీ నటుల మాయ నుంచి బయటకు రావాలని, సినిమాలను కేవలం వినోదం వరకే పరిమితం చేయాలని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వర్లు సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన భగత్‌సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్ 2కే24 కార్యక్రమం స్థానిక లయన్స్‌క్లబ్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సంఘం నియోజకవర్గ కన్వీనర్ పి.వాసు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సమాజంపై బాధ్యత పెంచుకోవాలన్నారు. రాజకీయ నేతలు, సినిమా నటుల మాయలో పడి కొందరు విద్యార్థులు భగత్‌సింగ్, అల్లూరి వంటి నేతల ఆశయాలను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కేవలం కార్పొరేట్ ఉద్యోగం పొందడమే చదువుల లక్ష్యం కాకూడదని సూచించారు. వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నేటి విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రామ్, ఫెస్ట్ కో కన్వీనర్ ఎండీ జాన్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డి.అనిల్‌బాబు, ఎం.చందు, జి.ధరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ



శిక్షణలో పాల్గొన్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముఖ్యంగా మార్కెట్లో వ్యాపార మార్గాన్ని, మెళుకువలను అలాగే వ్యాపార ప్రణాళికను సిద్ధం చేసుకుని పారిశ్రామిక రంగంలో దిగాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాగేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఐఎల్ఓ సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ వ్యాపారంలో రాణించాలంటే ముందుగా వ్యాపార నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు అలాగే రుణ సౌకర్యాలు, సబ్సిడీలు గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పీఎంఈజీపీ పథకం, ప్రాజెక్ట్ రిపోర్ట్ గురించి వివరించారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ, న్యూఢిల్లీ ప్రధాన శిక్షకులు పుల్లూరు హేమాద్రి మాట్లాడుతూ ప్రతి పారిశ్రామికవేత్త మార్కెట్ ప్రణాళిక, వ్యాపార సర్వే, విక్రయ ప్రణాళిక, లాభాలు, సిబ్బంది, అమ్మకాలు కొనుగోలు, లైసెన్స్‌లు వంటి అనేక విషయాలపై అవగాహన కల్పించారు. మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉన్న వ్యాపారాలపై ప్రాజెక్ట్ రిపోర్టులు తయారు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 30 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా పి శోభారాణి, ఐఎల్‌వో ట్రెనర్ రాజ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఖాతాదారులు భయపడొద్దు

ఉండి: కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ ఖాతాదారులు, రైతులు ఎటువంటి ఆంధోళన చెందాల్సిన అవసరం లేదని బ్యాంకు రూ.7 కోట్ల నిల్వలో ఉందని బ్యాంక్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి పి.ఆనందరాజు తెలిపారు. శుక్రవారం బ్యాంకులో ఖాతాదారులు, రైతులతో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్యాంక్ మాజీ చైర్మన్ కనకరాజు సూరి మాట్లాడుతూ బ్యాంకు ప్రక్షాళన కార్యక్రమాలు వేగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మాజీ అధ్యక్షుడు పేరిచెర్ల సూర్యనారాయణరాజు, పొత్తూరి వెంకటేశ్వర రాజు, కార్యదర్శి బగాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మొగల్తూరులో ఎంపీడీవో త్రిశూల పాణితో ఎంఈఓ, సీఆర్‌పీలు

మొగల్తూరు: మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి సూచించారు. ఇటీవల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శుక్రవారం ఎంఈఓ శామ్యూల్ జాన్, సీఆర్‌పీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ త్రిశూలపాణి మాట్లాడుతూ పాఠశాలలోని గదులు, పరసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వర్షాకాలం కావడంతో అంటురోగాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్.ఆనంద్, సానబోయిన కాశి, సువర్ణరాజు, చల్లా లక్ష్మణ్ కుమార్, కవురు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి అంశంపై అవగాహన అవసరం



పెనుగొండ రైసుమిలు వద్ద విద్యార్థినులు

పెనుగొండ: విద్యార్థి స్థాయి నుంచే ప్రతి అంశంపైనా అవగాహన పెంచుకోవాలని పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఎస్తేరు క్వీనీ అన్నారు. శుక్రవారం ఒకేషనల్ ట్రైనింగ్‌లో భాగంగా పెనుగొండలోని శ్రీ సుబ్రహ్మణ్య ఇండస్ట్రీ రైసు మిల్లు వద్ద అవగాహన కల్పించారు. వాటి పని తీరు, ధాన్యం, బియ్యం ఉప ఉత్పత్తులపై అవగాహన కల్పించారు.

## అండర్ పాస్ వంతెన నిర్మించాలి



సీపీఎం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక 14వ వార్డులోని జవహర్‌పేటలో రైల్వే ట్రాక్‌కు అండర్ పాస్ వంతెన నిర్మించాలని సీపీఎం డిమాండ్ చేసింది. వార్డులో శుక్రవారం పార్టీ వార్డు మహాసభ నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణరాజులకు నివాళులర్పించారు. సభలో పట్టణ కమిటీ కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ ప్రజా అవసరాల్ని పెడచెవిన పెట్టి, పాలకులు పెత్తందార్ల కోసం పని చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు ఆక్రమణల తొలగింపులో పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు బ్రతకలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల్ని మభ్యపెట్టేవిధంగా సంక్షేమ పథకాలను ప్రకటించి, అమలులో చిత్తశుద్ధి వహించడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని నాయకులు డోకల లక్ష్మి, ఎస్కే వల్లీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీవీ వర్మ, సందక సూరిబాబు, జి.రాంబాబు, లావణ్య,రాణి, రాము, సందక ఉదయ కుమారి, ఎర్రా కృష్ణవేణి పాల్గొన్నారు.